క్లుప్తంగా

వాటర్ ఫిల్టర్ ప్రారంభం



వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కొత్తూరు: మండల పరిధిలోని మల్లాపూర్ ఎస్సీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్‌ను శనివారం స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీవాసుల కోరిక మేరకు తనసొంత ఖర్చులతో స్వచ్ఛమైన నీటిని అందించాలనే ఉద్దేశంతో వాటర్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తిమ్మాపూర్ రైల్వే గేటు నుంచి మక్తగూడ వరకు సుమారు రూ.12 కోట్లతో బీటీరోడ్డును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చిర్ర సాయిలు, హరినాథ్‌రెడ్డి, బాల్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, వడ్డె శేఖర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ కోటను కాపాడాలని వినతి



ఎస్సై విజయ్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

కొందుర్గు: పూర్వ కాలం నుంచి గ్రామంలో మైసమ్మ కోటగా పిలువబడుతున్న స్థలం ఆక్రమణకు గురవుతుందని, ఈ స్థలం కబ్జా కాకుండా కాపాడాలని కోరుతూ జిల్లేడ్ చౌదరిగూడ మండలం వీరన్నపేట గ్రామస్తులు శనివారం తహసీల్దార్ జగదీశ్వర్‌తో పాటు ఎస్సై విజయ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ప్రస్తుతం కొందరు వ్యక్తులు స్థలం కబ్జా చేస్తూ గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతున్నారని పేర్కొన్నారు. కొందరు వ్యక్తులు స్థలం తమదని తెలుపుతున్నారని వాపోయారు. మైసమ్మ కోట స్థలం అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు. ఈ విషయమై తగు విచారణ జరిపి స్థలం కాపాడాలని కోరారు.

హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు



స్వామివారి పల్లకీసేవలో పాల్గొన్న ఎమ్మెల్యే, భక్తులు

షాద్‌నగర్: మున్సిపాలిటీ పరిధిలోని సోలీపూర్ గ్రామ శివారులో ఉన్న చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు రఘుపతిశర్మ, రాఘవేంద్రాచార్య, కృష్ణ, ప్రమోద్, సునీల్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమాలు కొనసాగాయి. అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు విశ్వం, శ్రీశైలంగౌడ్, కట్టా వెంకటేశ్‌గౌడ్, బస్వం, శ్రీనివాస్‌యాదవ్, జమ్రుద్‌ఖాన్, హరినాథ్‌రెడ్డి, శేఖర్, ప్రవీణ్, ప్రదీప్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం



ప్రజలకు వైద్యచికిత్సలు నిర్వహిస్తున్న వైద్యులు

శంకర్‌పల్లి: మండలంలోని దొంతాన్‌పల్లి గ్రామంలో శనివారం టంగటూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి, రోగులకు మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామాల్లో డెంగా, మలేరియా, టైఫాయిడ్ కేసులు వస్తుండడంతో వైద్య శిబిరం ఏర్పాటు చేసి, మందులు అందించినట్లు తెలిపారు. సీజనల్ కాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రియాజ్, సిబ్బంది మన్సూర్ అలీ తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు నిరంతర విద్యుత్‌ను అందిస్తుందన్నారు. కానీ నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్న క్రమంలో చిన్న చిన్న సాంకేతిక సమస్యలుంటే వెంటనే పరిష్కరించాలని సూచించారు. విద్యుత్ డిమాండ్ పెరుగుతున్నా అధికారులు కోతలు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేస్తుండటం అభినందనీయమన్నారు. అదేవిధంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకం కింద అర్హులందరికీ ఉచిత విద్యుత్‌ను సరఫరా చేసేవిధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఐదు కోట్ల విద్యుత్ బిల్లులు చెల్లించకుండా ఓ పరిశ్రమ యజమాని పరిశ్రమను మూసివేసి వెళ్లిపోయిన విషయాన్ని ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తల కన్నా నిరుపేదలకు అండగా నిలిచి గృహజ్యోతి పథకాన్ని అమలు చేస్తోందన్నారు. సమావేశంలో డీఈ యాదయ్య, ఏడీలు మాధవరావు, రవీందర్, ఏఈలు వినోద్, రాకేశ్‌గౌడ్, ఈశ్వరయ్య, రవికుమార్, సాయికుమార్, నరేందర్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, జంగ నర్సింలు, బాల్‌రాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ జవాబుదారీగా పనిచేయాలి



లచ్చంపేట అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రవీన్‌కుమార్

కొందుర్గు: ప్రతీ ఉద్యోగి జవాబుదారీగా పనిచేస్తేనే సర్కారు లక్ష్యం నెరవేరుతుందని జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీఓ ప్రవీన్‌కుమార్ సూచించారు. శనివారం ఆయన మండలంలోని తుమ్మలపల్లి, లచ్చంపేట గ్రామాల్లో ఆయన పర్యటించి పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. ఆయా కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారం పేదపిల్లలకు అందేలా చూడాలన్నారు. విద్యాభివృద్ధి కోసం అందరూ కృషి చేయాలన్నారు. నర్సరీల్లో పెంచిన మొక్కలను నాటడంతో పాటు సంరక్షించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రాములు, సౌజన్య, టీఏ వినోద్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని విఠ్యాల గ్రామానికి చెందిన బోయ యాదగిరి అలియాస్ మాస్టర్ గిరి వారంరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం మాజీ సర్పంచ్ జయశ్రీచంద్రశేఖర్ ఆధ్వర్యంలో నాయకులు మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా నాయకులు యాదగిరి కుటుంబానికి తమవంతుగా రూ.14వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, వాహబ్, లవణ్, మొయినొద్దీన్, పూర్యానాయక్, రాజు, రమేశ్, నర్సింలు, రాఘవేందర్, ప్రశాంత్, యాదయ్య, శ్రీహరి, యాదయ్య, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయతకు గుర్తు రాఖీ



ట్రాఫిక్ సీఐ వెంకటేశంకు రాఖీ విశిష్టతను వివరిస్తున్న బ్రహ్మకుమారీలు

చేవెళ్ల: రక్షాబంధన్ పవిత్రతకు గుర్తుగా జరుపుకుంటారని అందరూ అర్థం చేసుకోవాలని బ్రహ్మకుమారీ మంజుల అన్నారు. మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఆర్డీఓ సాయిరాం, తహసీల్దార్ కృష్ణయ్య, ట్రాఫిక్ సీఐ వెంకటేశం, ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డిలకు శనివారం బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీస్ సభ్యులందరూ కలిసి అధికారుల వద్దకు వెళ్లి రాఖీలు కట్టి రక్షాబంధన్ విశిష్టతను గురించి వివరించారు. కార్యక్రమంలో చేవెళ్ల బ్రహ్మకుమారీస్ శాఖ సభ్యులు బాల్‌రెడ్డి, పాండు, రాఘవేందర్‌చారి, వేణగోపాల్, భాగ్యలక్ష్మి, శశికళ, స్రవంతి తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న కృష్ణమోహన్‌ముదిరాజ్

చేవెళ్ల: గ్రామాల్లో నిర్మించే దేవాలయాలకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు టి.కృష్ణమోహన్‌ముదిరాజ్ అన్నారు. మండలంలోని పామెన గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న వీరభద్రస్వామి ఆలయానికి కృష్ణమోహన్ తన జన్మదినం సందర్భంగా 21వేల రూపాయల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాత కృష్ణమోహన్‌ను ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాములు, సత్యనారాయణచారి, నరేందర్‌రెడ్డి, జంగారెడ్డి, ఆత్మలింగం, శ్రీకాంత్‌రెడ్డి, నిరంజన్, రవి, వెంకటేశ్, సచిన్, శ్రీకాంత్, మణికంఠ థియేటర్ యజమాని శ్రీకాంత్‌రెడ్డి, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కృష్ణాగౌడ్, కన్నయ్య, వెంకటేశ్, బందయ్య ఉన్నారు.

వ్యవసాయశాఖలో బదిలీలు

కొత్త అధికారుల బాధ్యతల స్వీకరణ



చేవెళ్ల వ్యవసాయశాఖ ఏడీఏ కార్యాలయం

చేవెళ్ల: ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బదిలీలో వ్యవసాయశాఖలో పనిచేస్తున్న అధికారులకు స్థానచలనం కలిగింది. అయితే వ్యవసాయశాఖ బదిలీలు కాస్తా ఆలస్యమయ్యాయి. ఈ సందర్భంగా శనివారం వ్యవసాయశాఖ అధికారుల రిలీవింగ్, జాయింగ్‌లు జరిగాయి. చేవెళ్ల డివిజన్ పరిధిలోని చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ మండలాలకు సంబంధించి మొత్తం 7 మంది అధికారులు బదిలీ అయితే కొత్తగా 8 మంది అధికారులు డివిజన్‌లో బాధ్యతలు స్వీకరించినట్లు చేవెళ్ల ఏడీఏ రమాదేవి తెలిపారు. చేవెళ్ల డివిజన్‌లోని ఆయా మండలాల్లో పనిచేసే ఏఓలు, ఏఈఓలు బదిలీ కావటంతో వారి స్థానాల్లో కొత్తవారు బాధ్యతలు స్వీకరించారని చెప్పారు. ఇందులో భాగంగా చేవెళ్ల, మొయినాబాద్ మండలాలకు సంబంధించిన ఏఓలు బదిలీ అయ్యారు. చేవెళ్ల ఏఓగా ఉన్న తులసి బదిలీపై పరిగిలోని భూసార పరీక్షల కేంద్రానికి వెళ్లగా ఆమె స్థానంలో చేవెళ్లకు ఎస్.శంకర్‌లాల్ వచ్చారని పేర్కొన్నారు. మొయినాబాద్ మండలంలోని ఏఓ రాగమ్మ బదిలీపై రాజేంద్రనగర్‌కు బదిలీ కావటంతో ఆమె స్థానంలో పి.అనురాధ వచ్చారన్నారు. ఇక ఏఈఓలు చేవెళ్ల నుంచి కె.శివ, షాబాద్ మండలం నుంచి ఆర్.రాజేశ్వరి, యు.రాఘవేందర్, డి.సోనీశ్రీలు, శంకర్‌పల్లి నుంచి డి.మౌనికలు బదిలీ అయ్యారు. వీరి స్థానాల్లో కొత్తగా మండలంలోని ఖానాపూర్ క్లస్టర్‌కు జీ.పావని, షాబాద్ మండలంలోని షాబాద్ క్లస్టర్‌కు పి.శివతేజగౌడ్, హైతాబాద్ క్లస్టర్‌కు ఆర్.రాజేశ్వరి, మన్‌మర్రి క్లస్టర్‌కు వై.మౌనికలు, శంకర్‌పల్లి మండలంలోని పర్వేద క్లస్టర్‌కు ఎస్. రేణుక, మహాలింగాపురం క్లస్టర్‌కు మహ్మద్ మొహినొద్దీన్‌లు బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. డివిజన్‌లో బదిలీ అయిన వారి స్థానంలో కొత్తవారు వచ్చారని సిబ్బంది కొరత ఏమి ఉండదని ఏడీఏ తెలిపారు.

హిందువులపై దాడులు ఆపాలని నిరసన



శంకర్‌పల్లి చౌరస్తాలో నిరసన తెలుపుతున్న హిందూ ఐక్య వేదిక సభ్యులు

శంకర్‌పల్లిలో బంద్ ప్రశాంతం

శంకర్‌పల్లి: బంగ్లాదేశ్‌లో హిందువులపై కొనసాగుతున్న దాడులకు నిరసనగా శంకర్‌పల్లిలో హిందూ ఐక్య వేదిక శనివారం బంద్‌కు పిలుపునిచ్చింది. బంద్‌లో వ్యాపారులందరూ తమ దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేశారు. పార్టీలకతీతంగా రాజకీయ నాయకులు పాల్గొని తమ మద్దతు తెలిపారు. అనంతరం రామ్‌మందిర్ నుంచి శంకర్‌పల్లి చౌరస్తా వరకూ భారీ ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో హిందువుల వ్యాపార దుకాణాలు, ఆలయాల ధ్వంసం వంటి చర్యలను వెంటనే మానుకోవాలని హెచ్చరించారు. బంద్‌లో పాల్గొన్న వారికి వీరాంజనేయస్వామి ఆలయంలో 14వ వార్డు కౌన్సిలర్ శ్వేతా పాండురంగారెడ్డి అన్నదానం ఏర్పాటు చేశారు.

కార్మికులను విస్మరించిన ప్రభుత్వం

మహేశ్వరం: రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్ ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో సీఐటీయూ, కార్మిక సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్డా కూలీ ధరల పట్టికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలు నిర్మాణ రంగం కార్మికులకు ద్విచక్ర వాహనాలు, పింఛన్, రాయితీతో కూడిన పరికరాలు అందించడంతో పాటు, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉపాధి కల్పిస్తుండగా.. తెలంగాణ సర్కార్.. సెస్ ద్వారా వస్తున్న డబ్బులను దారి మళ్లించి అన్యాయం చేస్తోందని విమర్శించారు. కార్మికుల సమస్యల పరిష్కారం, సంక్షేమానికి సీఐటీయూ నిరంతరం పనిచేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అలువాల రవికుమార్, జిల్లా కోశాధికారి కవిత, మండల అధ్యక్షుడు ఏర్పుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు



గుంతలను పూడ్చే పనులను ప్రారంభిస్తున్న అంజనేయులుగౌడ్

మొయినాబాద్‌రూరల్: మండలంలోని చిన్నమంగళారం గ్రామానికి వెళ్లే రోడ్డుపై గుంతలు పడి గ్రామస్తులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతుండడం చూసి సొంత నిధులతో గుంతలు పూడ్చే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అదే గ్రామానికి చెందిన సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అవిశిపేట అంజనేయులుగౌడ్ అన్నారు. శనివారం చిన్నమంగళారం నుంచి వీరన్నపేట గ్రామానికి వెళ్లే రోడ్డు దాదాపు రెండు కిలోమీటర్ల పొడవునా అడుగడుగునా గుంతలుపడడంతో అంజనేయులుగౌడ్ సొంత నిధులతో గుంతలుపూడ్చే పనులను చేపట్టారు. గ్రామస్తులతో కలిసి రోడ్డు మరమ్మతులు ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధే లక్ష్యంగా తనవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, యువజన సంఘాల సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

కేశంపేట: రైతు సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని పోమాల్‌పల్లి గ్రామ మాజీ ఉపసర్పంచ్ అనుమగల్ల రమేశ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రెండు రుణమాఫీ చేయడం పట్ల మండల పరిధిలోని పోమాల్‌పల్లి గ్రామంలో శనివారం రైతులు, మహిళలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేశారు. అనంతరం మాజీ ఉపసర్పంచ్ రమేశ్ మాట్లాడుతూ.. రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు ఈ రుణమాఫీ ఉపయోగపడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని అందులో భాగంగా రైతులకు 2 లక్షల రుణమాఫీ చేసిందన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో కృష్ణయ్యయాదవ్, అశోక్‌రెడ్డి, ముత్యాల్‌రెడ్డి, శ్రీనివాసులు, రాజు, జంగయ్య, రాజు, రఘుపతి, యాదయ్య, ఎల్లయ్య, చంద్రయ్య, చెన్నకేశవులు పాల్గొన్నారు.

సోదరభావంతో మెలగాలి



విద్యార్థులకు రాఖీలు కడుతున్న విద్యార్థినులు

షాద్‌నగర్‌రూరల్: ప్రతిఒక్కరూ ఎదుటివారి పట్ల సోదరభావంతో మెలగాలని ప్రిన్సిపాల్ రఫత్‌సుల్తానా అన్నారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని శనివారం పట్టణంలోని భాగ్యనగర్‌కాలనీలో గల కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపాల్ రఫత్ సుల్తానా ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు విద్యార్థులకు రాఖీలు కట్టి సోదరభావాన్ని వ్యక్తపరిచారు. అనంతరం రఫత్‌సుల్తానా మాట్లాడుతూ.. దేశ సంస్కృతి సంప్రదాయాలు ప్రపంచ దేశాలకు ఆదర్శమన్నారు. అలాంటి సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. దేశ భవిష్యత్ యువత, విద్యార్థి చేతుల్లోనే ఉందన్నారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల ప్రేమానురాగాలకు సూచకంగా జరుపుకునే రాఖీ పండగకు ఎంతో విశిష్టత ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

సీఐ విజయకుమార్



సీసీ కెమెరాల అవశ్యకతను వివరిస్తున్న సీఐ విజయకుమార్

షాద్‌నగర్‌రూరల్: సీసీకెమెరాలను ఏర్పాటు చేయడంతో నేరాలను నియంత్రించవచ్చని సీఐ విజయకుమార్ అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీసీ కెమెరాల ఆవశ్యకతను పట్టణ సీఐ విజయకుమార్ గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా సీఐ విజయకుమార్ మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతిఒక్కరూ తమ ఇళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ముఖ్యకూడళ్లు, గ్రామంలోని బస్టాండ్, చౌరస్తా వంటి ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. నేరాల నియంత్రణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. సమావేశంలో మాజీ సర్పంచ్‌లు బెంది మోహన్‌రెడ్డి, యాదయ్య, పెంటారెడ్డి, రాంరెడ్డి, ఆర్ల యాదయ్యయాదవ్, చంద్రయ్య, మధుకర్‌గౌడ్, శ్రీపాదరెడ్డి, యాదయ్య, రామస్వామి, రాజు, అశోక్‌గౌడ్ జంగయ్య పాల్గొన్నారు.

నిందితులను ఎన్‌కౌంటర్ చేయాలి

కోల్‌కతా ఘటనకు నిరసనగా వైద్యుల భారీ ర్యాలీ, ధర్నా



చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది



మొయినాబాద్‌లో..

షాద్‌నగర్‌రూరల్: కోల్‌కతాలో యువ వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్యకు పాల్పడిన నిందితులను దిశ తరహాలో వెంటనే ఎన్‌కౌంటర్ చేయాలని వైద్యులు డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా వైద్యులు, సిబ్బందిపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలకు నిరసనగా శనివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు, సిబ్బంది పెద్దఎత్తున ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని ముఖ్య కూడలికి చేరుకొని రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా వైద్యులు, సిబ్బందిపై రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. అత్యవసర పరిస్థితుల్లో రోగుల ప్రాణాలను కాపాడే వైద్యుల ప్రాణాలకు భద్రత లేదన్నారు. కోల్‌కతా ఘటనపై దేశవ్యాప్తంగా వైద్యులు ఏకతాటిపైకి వచ్చారని, దీంతో దేశంలో నిరసనల గళం వినిపిస్తోందన్నారు. జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య కేసులో అదే ఆస్పత్రిలో పనిచేసే కొందరి వైద్యులు, సిబ్బంది పాత్ర ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. కోల్‌కతా ఘటనకు కారణమై నిందితులపై దిశ తరహా ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు, సిబ్బంది, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో

కోల్‌కతాలో యువ డాక్టర్‌పై జరిగి అత్యాచారం, హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కమిటీ సభ్యుడు భగత్‌సింగ్ అన్నారు. దేశంలో వైద్య విద్యార్థులపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలను నిరసిస్తూ శనివారం పట్టణంలోని వైద్య విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ చేపట్టారు. హత్య కేసులో దోషులకు వెంటనే ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నవీన్, సాయితేజ, అరుణ్, మహేందర్, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

మొయినాబాద్: కోలకతాలో జూనియర్ డాక్టర్‌పై అఘాయిత్యానికి పాల్పడి హత్యచేసిన నిందితుడిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని ఆర్ఎంపీ డాక్టర్స్ అసోసియేషన్ చేవెళ్ల డివిజన్ ఉపాధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. ఆ ఘటనకు నిరసనగా శనివారం మండల కేంద్రంలో ఆర్ఎంపీ డాక్టర్లు నిరసన ర్యాలీ చేపట్టారు. నిందితుడిని శిక్షించి బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ వైద్యులు రామచందర్, వీరానందం, మహిపాల్, అరుణ, రమాదేవి, చంద్రకళ, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో నామమాత్రపు వైద్యసేవలు

చేవెళ్ల: కోల్‌కతాలో మహిళా డాక్టర్ అత్యాచార ఘటనకు నిరసనగా దేశవ్యాప్తంగా ఇండియన్ మెడికల్ అసోషియేషన్(ఐఎంఏ) ఇచ్చిన 24 గంటల బంద్‌ను చేవెళ్లలోని ఆస్పత్రులు పాటించాయి. శనివారం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది హాజరైన వైద్యసేవలను నామమాత్రంగానే అందించారు. ముందుగానే వైద్యసేవలు ఓపీ సేవలు బంద్ ఉంటాయని ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో రోగులు సైతం తక్కువ సంఖ్యలోనే వచ్చారు. దీంతో తెలియని వారు అత్యవసరమైన వారు వస్తే వారికి వైద్యులు వైద్యసేవలు అందించి పంపించారు. కాని ఓపీ రికార్డుల్లో వారికి వైద్యం అందించినట్లుగా మాత్రం నమోదు చేయలేదు. వచ్చిన వారికి మానవత్వ దృక్పథంతో వైద్యం అందించినట్లు చెప్పారు. అనంతరం వైద్యులు, వైద్య సిబ్బంది ఆస్పత్రి బయట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్ఎంపీ వైద్యుల నిరసన ర్యాలీ

మండల కేంద్రంలోని ఆర్ఎంపీ వైద్యులు కోల్‌కతా సంఘటనకు నిరసనగా ర్యాలీ చేపట్టారు. శనివారం ఉదయం వారు ఆయా గ్రామాల్లో ఉన్న సబ్ సెంటర్లను బంద్ చేసి ఆర్ఎంపీ డాక్టర్లు అందరూ ఐఎంఏ పిలుపుతో వైద్యసేవలను బంద్‌చేసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ డాక్టర్ల సంఘం నాయకులు రాంచందర్‌గౌడ్, సుభాష్, డివిజన్ అధ్యక్షుడు బి.రాంచందర్, ఉపాధ్యక్షుడు జగన్, ప్రధాన కార్యదర్శి వీరానందం, కార్యదర్శి మహిపాల్, కోశాధికారి ప్రభాకర్, సభ్యులు విజయలక్ష్మి, అరుణ, రమాదేవి, ప్రియాంకా, శశికల, కృష్ణారావు, రవికుమార్, రవి, దశరథ్, వెంకట్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.